

బెస్ట్ అవార్డు అందుకున్న కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డ్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అందుకున్నారు. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఈ అవార్డును అందుకున్నారు.



ఎటిసితో తిప్పలు తప్పవా..?

- జిల్లాలో ఏర్పాట్లకు రంగం సిద్ధం
- థర్డ్ పార్టీ ఏజెన్సీతో నిర్వహణ
- వ్యయ ప్రయాసలు తప్పవని వాహనదారుల్లో గుబులు
- పొరుగు జిల్లాలో అమలు విఫలం
- జిల్లాలో వ్యతిరేకిస్తున్న వాహనదారులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఇదివరకు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించిన వాహనాల ఫిట్నెస్ పరీక్షలు ఇకపై ఆటోమేటెడ్ మిషనరీ ఆధారితంగా ఈ పరీక్షలను రవాణా శాఖ అధికారులు కొనసాగించనున్నారు. ఈ నేపథ్యంలో వ్యయప్రయాసలు తడిసి మోపెడు కానున్న నేపథ్యంలో వాహనదారుల గుండెలు గుబేలు మంటున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా శాఖలో కొత్త విధానాలకు శ్రీకారం చుడుతోంది. జిల్లాలో ఇప్పటికే డ్రైవింగ్ లైసెన్సు జారీలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ సిస్టంను అమలు చేస్తుండగా, దీనికి తోడు వాహనాల ఫిట్నెస్‌ల జారీలోనూ ఆటోమేటెడ్ టెస్టింగ్ విధానాన్ని ముందుకు తెస్తుంది. జిల్లాలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ విధానంతో తలలు పట్టుకుంటున్న వాహనదారులకు నూతనంగా అమలు చేయనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్ మరొక తలనొప్పిగా మారనుందని వాహనదారులు, రవాణా రంగ నిర్వాహకులు భావిస్తున్నారు.

ప్రైవేట్ ఏజెన్సీ తో నిర్వహణ : కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయ కేంద్రంగా కల్లూరు మండలంలోని చిన్నటేకూరు గ్రామంలో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్ (ఎటిసి) ఏర్పాటు చేయడానికి రవాణా శాఖకు ప్రభుత్వ అనుమతులు లభించాయి. ఇప్పటికే దీని ఏర్పాటుకు ప్రైవేటు ఏజెన్సీ టెండరును దక్కించుకొంది. దీనికోసం అవసరమైన భూమి కూడా గుర్తించారు. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు, ఆదోని కేంద్రంగా రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి.

సేవల వికేంద్రీకరణకు విరుద్ధంగా: రవాణాశాఖ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మొదట్లో నుంచి సేవా వికేంద్రీకరణ దృష్టితో జిల్లాలో పలుచోట్ల రవాణా శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానం అందుకు పూర్తి వ్యతిరేకంగా కనిపిస్తోంది.

ఎటిసిని ప్రస్తుతం కర్నూలు ఆర్‌టిఒ పరిధిలో మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా ఆర్‌టిఒ కార్యాలయాలను ఎంవిఐ కార్యాలయాలను వాహనదారుల సౌలభ్యం కోసం వికేంద్రీకరించారు. ప్రస్తుతం కేవలం జిల్లా కేంద్రం వద్ద ఎటిసిని నెలకొల్పడం పట్ల వాహనదారుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. జిల్లాలో ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ఈ సెంటర్‌కు వచ్చి ఫిట్నెస్ సర్టిఫికెట్ను పొందవలసి ఉంది. దీనివల్ల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న వాహనదారులకు ఇది వ్యయ ప్రయాసలకు గురికాక తప్పని పరిస్థితి. కౌతాళం, హొలహర్వి, మంత్రాలయం వంటి మండలాలకు చెందిన వాహనదారులు ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను పొందాలంటే తీవ్ర ఇబ్బందులకు గురికాక తప్పదని దిగులు చెందుతున్నారు.

పొరుగు జిల్లాలో విఫలం : కొన్ని నెలల క్రితం పరుగు జిల్లా ఆయన నంద్యాలలోని ఆత్మకూరు, డోను రవాణా శాఖ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలుకు పూనుకున్నప్పటికీ అక్కడ ఇది పెద్దగా ఫలించకపోగా వాహనదారుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వాటి నిర్వహణ విఫలమైంది. వాహనదారులకు అనుకూలంగా పాత పద్ధతిలోనే డ్రైవింగ్ ఫిట్నెస్ పరీక్షలను నిర్వహించాలని కోరుకుంటున్నారు.

థర్డ్ పార్టీ ఏజెన్సీతో నష్టం



థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా ఎటిసిలను నిర్వహించడం కార్మికులకు నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. ప్రభుత్వ రవాణా శాఖ అధికారుల ప్రమేయం లేకపోవడం ఇలాంటి అనుమానాలకు తావిస్తుంది. ప్రైవేట్ వ్యక్తుల ఇష్టారాజ్యంగా అక్రమాలకు తెరలేచే ప్రమాదం పొంచి ఉంది.

- మహమూద్, ఆటో యూనియన్ నాయకులు

పాత పద్ధతిలోనే ఎఫ్‌సిలు జారీ చేయాలి



ఎటిసి సెంటర్ల ద్వారా వాహనదారులకు కార్మికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ విధానం అమలు చేయడం ద్వారా జిల్లా సరిహద్దుల్లో ఉండే వాహనదారులు ఎఫ్‌సిల కోసం రెండు రోజులు పని వదులుకోవాల్సి వస్తుంది. ఒక ఎఫ్‌సి జారీ చేయడానికి కనీసం 15 నిమిషాలకు పైగా సమయం పడుతుంది.

- కె.ప్రభాకర్ ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య కేసు

నిందితులను కఠినంగా శిక్షించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు
- కలెక్టరేట్ ఎదుట ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబులి డిమాండ్ చేశారు.కుటుంబానికి 30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఎపిగ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా శనివారం నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఎండి అంజిబాబు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేయడం చాలా దుర్మార్గమైన చర్యఅని అన్నారు. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫీల్డ్‌అసిస్టెంట్లను బెదిరించడం బలవంతంగా రాజీనామాలు చేయించడం చేశారని, ఏకంగా హత్యలు చేసే వరకు వెళ్లారని విమర్శించారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యకు కూటమి ప్రభుత్వ నాయకులే బాధ్యత వహించాలని కోరారు. ఇప్పటివరకు బలవంతంగా రాజీనామాలు చేయించిన వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ల యూనియన్ జిల్లా నాయకులు బొజ్జప్ప, దేవేంద్ర, వీరరాజు ,వీరన్న ,సురేంద్ర, మునిస్వామి, అభిబ్ ,హనుమంతు, కృష్ణకుమార్, మెహబూబు, మహదేవ్, రామాంజనేయులు, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

15వ రోజు 391 మంది అభ్యర్థులు ఎంపిక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు ఎపిఎస్‌పి రెండవ బెటాలియన్‌లో 15వ రోజు శనివారం నిర్వహించిన దేహదారుఢ్య సామర్థ్య మెయిన్స్ పరీక్షలకు కానిస్టేబుల్ మెయిన్స్(ఫైనల్) పరీక్షకు 391 మంది అభ్యర్థులు ఎంపిక అయ్యారని కర్నూలు జిల్లా ఇంచార్జ్ ఎస్‌పి అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. ఈ పరీక్షలను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. 629 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు, ఎఫిషిఎన్సీ టెస్టులు నిర్వహించారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 444 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగు పరీక్షలో 246 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. లాంగ్ జంప్ లో 380 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఇంచార్జ్ ఎస్‌పితో పాటు హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ ఐలు, ఎఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు ఉన్నారు.

రచ్చుమర్రిలో భారీ చోరీ

- 70 తులాల బంగారం, కిలో వెండి, రూ.3.5 లక్షల నగదు దొంగతనం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో భారీ చోరీ జరిగింది. 70 తులాల బంగారం, కిలో వెండి, రూ.3.5 లక్షల నగదు చోరీకి గురయింది. బాధితుల ఫిర్యాదు మేరకు... గ్రామంలోని మురారి శేషాద్రిశెట్టి కుటుంబం వారం రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లింది. కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్ర వైపు తీర్థ యాత్రలకు వెళ్లి శుక్రవారం రాత్రి వచ్చిచూడగా షాక్‌కు గురయ్యారు. ఇంట్లోని 70 తులాల బంగారం, కిలోవెండి, రూ.3.5 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. శనివారం ఉదయం మాధవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విజయ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీం, సిఐ పవన్‌కుమార్ రెడ్డి, ఎఎస్ఐ చలపతి సిబ్బందితో కలిసి వేలి ముద్రలు సేకరించారు. దక్షిణం వైపు ముఖం ఉన్న ఇంటి మెట్లు ఎక్కి రెండో అంతస్తు మిద్దె పైనుంచి ఉత్తరం వైపు ముఖం కలిగిన ఇంట్లోకి పైకప్పునకు ఇనుప చువ్వలు జరిపి లోపలికి వెళ్లి ఈ దొంగతనానికి పాల్పడినట్లు బాధితులు శేషాద్రి శెట్టి పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వలసలు పట్టని పాలకులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడుబూరు, నందవరం, ఆదోని మండలాల్లోని గ్రామాల ప్రజలు ఊర్లకు ఊర్లు ఖాళీ చేసి కన్న బిడ్డలను చదువు మాన్పించి వలసలు వెళుతున్నా పాలకపక్షాలకు, అధికారులకు ఎలాంటి కనికరం లేకుండా పోతోంది. వలసల నివారణ కోసం గ్రామాలలో పనులు కల్పించి, విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఒక ఐచర్ వాహనంలో 10 కుటుంబాలు, తల్లి పిల్ల అంతా తమ సామాన్లను మీదేసుకొని చలికి వణుకుతూ, ఒకరిపై ఒకరు కుక్కుకొని కూర్చుంటూ బతకడం కోసం పోవడం చాలా బాధాకరం. ఇక్కడే ఉంటే ఇంట్లో ఒకరికి పని ఉంటే మరొకరికి పని లేదు. పని పెట్టినా చేసిన పనికి కూలి సరిగా ఇచ్చే పరిస్థితి లేదు. ఇచ్చే కూలీ సైతం రూ.130 నుండి రూ.150 వరకు పడటం వల్ల, కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రోజుకు రూ.400 కూలి ఇచ్చినా ఉన్న ఊరిని వదిలిపెట్టి, పిల్లల చదువులను మాన్పించి ఎక్కడో బతకడానికి వెళ్లే అవసరం ఉండదు. 6, 7 తరగతుల పిల్లలే కాదు భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిసినా పదవ తరగతి పిల్లలను సైతం వలసకు తీసుకెళ్తున్నారు. గ్రామాలలో పనులు కల్పించి, రోజువారి కూలీ రూ.400 ఇవ్వాల్సి అవసరం ఉంది. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే వలస వెళ్లిన విద్యార్థులను సైతం అధికారులే దగ్గరుండి తిరిగి తీసుకుని రావాలి.

పరపతి పోరు : కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్‌లు) ఉన్నాయి. ఆయా పాలకవర్గాలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఆరు నెలలపాటు త్రిసభ్య కమిటీలతో ఆయా సొసైటీలను నడపాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక సహకార సంఘాల కమిటీల్లో స్థానం దక్కించుకునేందుకు పలువురు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. తమనే సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా నియమించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. టిడిపి, బిజెపి, జనసేన నేతలు ఎవరికి వారు తమ ప్రయత్నాలు గట్టిగా సాగిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చివరిగా 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. 2018లో పదవీకాలం ముగియగా అప్పట్లో ఎన్నికలు నిర్వహించలేదు. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను తెరపైకి తీసుకొచ్చింది. గతేడాది జులై నెలాఖరుతో వీరి పదవీకాలం ముగిసింది. ఆ వెనువెంటనే కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జీలను నియమించింది. పాలకవర్గం గడువు ముగిసి ఏడేళ్లవుతున్నా అటు ప్రాథమిక సహకార సంఘాలకు, ఇటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రెగ్యులర్ పాలకవర్గాలు లేవు. పర్సన్ ఇన్‌ఛార్జీలతో పాలన నడుపుతున్నారు. ప్రస్తుతం సొసైటీల అధ్యక్ష, డైరెక్టర్ల స్థానాలకు గ్రామస్థాయి నుంచి పలువురు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం టిడిపిలో ఆశావహులు పెరిగిపోయారు. దీనికితోడు బిజెపి, జనసేన నేతలు కూడా పదవులు ఆశిస్తున్నారు. తమకూ కొన్ని సంఘాలు కేటాయించాలని ఆ రెండు పార్టీల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది.

వణికిస్తున్న చలి : సాయంత్రం కూడా కాకముందే వాతావరణం చల్లగా మారిపోతోంది. రాత్రి గడిచేకొద్దీ మరింత చల్లగా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వెచ్చదనం కోసం తపించిపోతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లె ఇలా అన్ని చోట్లా శీతలగాలులు వీస్తున్నా యి. చాలా ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో చలి కారణంగా ప్రజలు జలుబు, దగ్గు, బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది శ్వాసనాళాలు మూసుకుపోయి ఉపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అదే సమయంలో ఒక రకమైన ఇన్ఫ్లుయెంజా వైరస్ కూడా ఈ సీజన్లో వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శీతల గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

తెలకపల్లి నరసింహయ్య వర్ధంతి జిల్లా వ్యాప్తంగా నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు. కర్నూలులోని ఆయన గృహాన్ని సాహితీ స్రవంతీ ప్రాంతీయ కార్యాలయంగా ప్రారంభించారు. యోగివేమన జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళు లర్పించారు.



విద్యార్థులతో కలివిడిగా డిఇఒ

మధ్యాహ్న భోజనం డిఇఒ పరిశీలన



విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేస్తున్న డిఇఒ

ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో జిల్లా విద్యాధికారి మధ్యాహ్న భోజనాన్ని శనివారం పరిశీలించారు. విద్యార్థులు తింటున్న భోజనాన్ని పిల్లలతో కలసి కిందనే కూర్చుని అడిగి తిన్నారు. విద్యార్థులు డిఇఒకు ముద్దలు చేసి అరచేతిలో పెట్టగా డిఇఒ రుచి చేశారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా?..వంటలేలా వుంటున్నాయి? వంటి ప్రశ్నలు వేసి విద్యార్థులతో కలివిడిగా మాట్లాడుతూ ముచ్చటించారు. అందరిని పలకరిస్తూ అందరివాడై సరదాగా గడిపారు. విద్యార్థులేలా చదువుతున్నారని, చదువుపట్ల శ్రద్ధ వహించాలని చెబుతూ ముచ్చటించారు. వంట నిర్వాహకులను పిలిచి పలుసూచనలు చేశారు. నాణ్యత విషయంలో రాజీ పదొద్దని ప్రధానోపాధ్యాయులను , సిబ్బందిని ఆదేశించారు.



పోస్టర్ విడుదల చేస్తున్న రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, తదితరులు

పిల్లల సంబరాలను జయప్రదం చేద్దాం

-రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఏటా సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే బాలోత్సవం సంబరాలను వైభవంగా జరిపి జయప్రదం చేద్దామని బాలోత్సవ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య అన్నారు. శనివారం అబ్బాస్ నగర్ లోని ఆయన చాంబర్లోబాలోత్సవం- 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా నిర్వహించే బాలోత్సవ సంబరాలు విద్యార్థులకు చిన్ననాటి నుండి సాంస్కృతిక వైభవాన్ని తెలియజేస్తాయన్నారు. చిన్నప్పటినుండి విద్యార్థుల్లో ఇటువంటి కార్యక్రమాలు చేసి నైతిక మానవతా సాంస్కృతిక విలువల్ని నేర్పించాల్సిన అవసరముందన్నారు. ఏడాది ఎక్కువ పాఠశాలలో నమోదుకు కమిటీ నిర్వాహకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు డి.ధనుంజయ, జెఎన్.శేషయ్య, కెంగార మోహన్, జె. రంగస్వామి, వర్మ, సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



యుఇఇయు డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఇ ఉమాపతి, నాయకులు అంజిబాబు, నాగరాజు

కూటమి ప్రభుత్వం తక్షణమేస్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కర్నూలు జిల్లా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కర్నూలు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎండి. అంజిబాబు, సిఐటియు కర్నూలు నగర కార్యదర్శి మమ్మద్ షఫీ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎం.ఉమాపతి సమక్షంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) 2025 డైరీని, యూనియన్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. అనంతరం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)జిల్లా సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయం కార్మిక కర్షక భవన్‌లో ఆ యూనియన్ కర్నూలు డివిజన్ అధ్యక్షులు పి.మాబు అధ్యక్షతన నిర్వహించారు. ఎండి. అంజిబాబు, మహమ్మద్ రఫీ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఎస్‌పిడిసిఎల్ కంపెనీ కమిటీ, ఉపాధ్యక్షులు పి.నాగరాజు, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ బాబు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు తక్షణమే రద్దు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న డిఎ, ఎరియర్స్ ఇవ్వాలని, 2023 పిఆర్‌సిని కాంట్రాక్ట్ కార్మికులకు వర్తింపజేసి, వారందరికీ అరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పి.మాబు, ఎం.నాగేంద్రప్ప, బి.కాలప్ప, కె.దేవేంద్రప్ప, యు. ఆంజనేయులు, ప్రసన్న ఆంజనేయులు, బి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

చట్టాలపట్ల మహిళలకు అవగాహన అవసరం

పత్తికొండ ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవల్లి

ప్రజాశక్తి-తుగ్గలి

మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండి చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ జూనియర్ సివిల్ ఇంచార్జి జడ్జి ఎవిఎస్. శ్రీవల్లి తెలిపారు. శనివారం కర్నూలు జిల్లా తుగ్గలిలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో పత్తికొండ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ 'మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు' నిర్వహించారు. ప్యానల్ అడ్వకేట్ సురాజ్‌నబి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పత్తికొండ జూనియర్ సివిల్ కోర్ట్ ఇంచార్జి జడ్జి ఎవిఎస్. శ్రీవల్లి, తుగ్గలి తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ విశ్వమోహన్, పత్తికొండ సిడిపిఒ లలిత, తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి, వెలుగు ఎపిఎం రాధాకృష్ణ పాల్గొన్నారు. జస్టిస్ శ్రీవల్లి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళల్లో మార్పు రావాలని, ముఖ్యంగా మహిళలు ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత మహిళలు బాగా చదువుకుని తమ కాళ్ళమీద తాము నిలబడాలని తెలిపారు. భారత రాజ్యాంగం మహిళలకు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చిందని సూచించారు. అన్యాయం జరిగినప్పుడు మహిళలు వెంటనే పోలీస్ స్టేషన్ ఆశ్రయించాలన్నారు. అక్కడ న్యాయం జరగకపోతే స్థానిక కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థలో అధికారులను సంప్రదించాలని తెలిపారు. డబ్బులు పెట్టి అడ్వకేట్లను పెట్టుకోలేని సమక్షంలో ఒక తెల్ల పేపర్ మీద రాసిఇస్తే మండల న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఉచితంగా న్యాయం పొందవచ్చని సూచించారు.అనంతరం ముఖ్య అతిథులు తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ విశ్వ మోహన్, సీనియర్ న్యాయవాది కాశీ విశ్వనాథ్, ఎస్ఐకృష్ణమూర్తి, సిడిపిఒ లలిత మాట్లాడారు. తదనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుండి వచ్చిన కిట్లను మహిళలకు అందించారు. న్యాయవాది నాగరాజు, వెలుగు ఎపిఎం రాధాకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుమిత్రమ్మ, అంబిక, నాగేశ్వరమ్మ, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది రాఘవేంద్ర, ప్రసాద్,మహిళలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీవల్లి



ప్రదర్శనను ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు, పాల్గొన్న సిబ్బంది

ఓటు ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఓటు కలిగిన ప్రతి పౌరుడు ఓటు ప్రాముఖ్యతను తెలుసుకోవాలని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని, కొండారెడ్డిబురుజు పార్కు వద్ద నియోజకవర్గంలోని బిఎల్‌ఒలు, విఆర్‌ఒలతో కమిషనర్, ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు.కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి ఓటు బలమైన పునాది వంటిదని, ఓటు హక్కును పొందడం, వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొన్నారు. ఐదేళ్లకు ఓసారి పాలకులను ప్రజలే స్వయంగా ఓటు వేసి ఎన్నుకునే మన దేశం, ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కుతో నచ్చిన వారికి అధికారం కట్టబెట్టే అధికారం రాజ్యాంగం కల్పించిందని, ఓటు అనేది వజ్రాయుధం లాంటిదన్నారు. డిప్యూటీ తహశీల్దార్ డబ్ల్యు ధనుంజయ్, సూపరింటెండెంట్ సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి బిందు మాధవ్‌కు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కాకినాడ జిల్లా ఎస్‌పిగా బదిలీ పై వెళ్తున్న కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ కు కర్నూలు రాగమయూరి రిసార్ట్‌లో కర్నూలు జిల్లా పోలీసు అధికారులు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. బిందుమాధవ్ దంపతులను కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ శాలువ, పూలమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో, విధి నిర్వహణలో జిల్లా పోలీసుయంత్రాంగం అందించిన సహకారం మరువలేనిదని జి. బిందు మాధవ్ తెలిపారు. డాక్టర్ కోయ ప్రవీణ్, నంద్యాల జిల్లా ఎస్‌పి ఆదిరాజ్ సింగ్ రాణా, అన్నమయ్య జిల్లా ఎస్‌పి వి. విద్యాసాగర్ నాయుడు, కడప జిల్లా ఎస్‌పి ఇజి. అశోక్ కుమార్ , జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లాకళ్యాణి, విజిలెన్స్‌అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి చౌడేశ్వరి, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

అంగన్వాడీల సమ్మె కాలపు హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గోనెగండ్లలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో మండల నాయకులు మల్లేశ్వరి అధ్యక్షతన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, ప్రాజెక్టు నాయకులు గోవర్ధనమ్మ, శైలజ, మండల నాయకులు నబీరసూల్, నీరజ, పుష్ప, సెక్టార్ నాయకులు వరలక్ష్మి, మునెమ్మ మాట్లాడారు. రాష్ట్రంలో 42 రోజుల పాటు సమ్మె నిర్వహించి నాటి నిరంకుశ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపిన ఘనత అంగన్వాడీలదేనని తెలిపారు. నాడు ప్రతిపక్షంగా ఉన్న చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను, అధికారుల ద్వారా చేసుకున్న రాతపూర్వక ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రాథమిక విద్య ప్రారంభ గురువులుగా ఉన్న అంగన్వాడీల చేత విద్యతో పాటు పాలకులకు అవసరమైన అన్ని రకాల చాకిరి చేయించుకుని, ఇచ్చే వేతనంలో మాత్రం ఎటువంటి మార్పు లేకుండా కొనసాగిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ వర్కర్, హెల్పర్లు సమస్యల పరిష్కారం కోసం మరింత ఐక్యమై ఉద్యమించాలని కోరారు. సిఐటియు ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి రాముడు, గోనెగండ్ల నాయకులు బి.కరుణాకర్ పాల్గొని మాట్లాడారు.

సమరయోధుల వేషధారణతో ర్యాలీ

ప్రజాశక్తి - దేవనకొండ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యార్థులు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యార్థులు దేవనకొండ ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న నాయకుల వేషధారణలో ర్యాలీ చేపట్టారు. భారత మాత, గాంధీ, అంబేద్కర్, జవహర్ లాల్ నెహ్రూ, ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్ సింగ్, నేతాజీ, సుభాష్ చంద్రబోస్, ఇందిరాగాంధీ, రుద్రమదేవి, సర్దార్ వల్లభాయ్ పటేల్, వివేకానంద, మదర్ థెరిస్సా, కస్తూరిబా, సరోజినీ నాయుడు, అల్లూరి సీతారామరాజు వేషధారణ ప్రదర్శించారు. ఎఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు దస్తగిరి, చెన్నయ్య, ప్రధానోపాధ్యాయులు బి.ఉచ్చీరప్ప, కరస్పాండెంట్ రఘునాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం'



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జయమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి

బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి జయమ్మ తెలిపారు. శనివారం సిడిపిఒ మద్దమ్మ ఆధ్వర్యంలో స్థానిక స్త్రీ శక్తి భవనంలో మహిళలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యువకులతో పాటు యువతను సమానంగా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ స్థానం కల్పించి ప్రోత్సహించాలని కోరారు. యుక్త వయస్సు వచ్చే వరకు వివాహాలు చేయకూడదని చెప్పారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే పోలీసులకు, మహిళా సంఘాలకు, అంగన్వాడీ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని కోరారు.

'7 నుంచి క్రికెట్ టోర్నమెంట్'

ప్రజాశక్తి - ఆదోని

ఫిబ్రవరి 7, 8, 9న ఆదోని మున్సిపల్ మైదానంలో ఆల్ డిపార్ట్‌మెంట్ ఫ్రెండ్‌షిప్ కప్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, నిర్వాహకులు ముజీబ్ అహ్మద్ తెలిపారు. మున్సిపల్ మైదానం అనుమతి కోసం శనివారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, రెవెన్యూ, మున్సిపల్, టీచర్లు, న్యాయవాదులు, పోలీసులు, మీడియా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇతర జట్లకు అనుమతి లేదని తెలిపారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, లేకపోతే పోరాటం చేస్తామని వైసిపి నాయకులు హెచ్చరించారు. ఆలూరు మండలం అరికెర గ్రామంలో హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబ సభ్యులను వైసిపి నాయకులు శనివారం ఆలూరు ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో పరామర్శించారు. హత్య సంఘటన తీరును బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు శశికళ మాట్లాడారు. లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తామని నిస్సిగ్గుగా దావోస్ సమావేశంలో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఈరన్న హత్యను ప్రోత్సహించిన వారిపై కూడా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులపై తమకు ఇప్పటికీ గౌరవం ఉందని, వారు చట్టపరంగా న్యాయం చేయకపోతే తాము కూడా ప్రతిఘటించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈరన్న హత్య విషయాన్ని జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి వైసిపి నాయకులపై దాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఆలూరు తాలూకా కూటమి నాయకులు ఎవరైనా వైసిపి కార్యకర్తలపై దాడులు చేయాలని చూస్తే తనకు ఒక ఫోన్ కాల్ వస్తే ముందుంటానని ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు రూ.లక్షలు తీసుకొని టిడిపి ఇన్‌ఛార్జినని చెప్పుకునే వీరభద్రగౌడ్, ఆయన తనయుడు గిరి మల్లేష్ గౌడ్, అదే సామాజిక వర్గానికి చెందిన విలేకరి మల్లికార్జున కలిసి హత్యకు ప్రోత్సహించినట్లు తెలిసిందని అన్నారు. పోలీసులు విచారణ జరిపి హత్యకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి శిక్షించాలని కోరారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు తన మామ, భర్త, తమ అనుచరుడు సాయి సాంబశివుడిని టిడిపి నాయకులు హత్య చేశారని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి తెలిపారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా హోమ్ మంత్రి అనిత పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు.



బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న వైసిపి నాయకులు

వీరభద్రగౌడ్ ప్రోత్సాహంతోనే

నా భర్తను హత్య చేశారు...

- మృతుని భార్య నాగలక్ష్మి

ప్రజాశక్తి - ఆలూరు



విలపిస్తున్న నాగలక్ష్మి

టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, ఆయన కొడుకు గిరి మల్లేష్ గౌడ్ ప్రోత్సాహంతోనే తన భర్త ఈరన్నను హత్య చేశారని మృతుని భార్య నాగలక్ష్మి తెలిపారు. నిందితులు దబ్బాల గాదిలింగ, దబ్బాల గోవర్ధన్, మంగలి గోపి, బొగ్గుల ఈరన్న, రామదాసు మరికొందరు కలిసి హత్య చేసినట్లు అనుమానాలు ఉన్నాయని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం దబ్బాల గాదిలింగతో పాటు మరొకరు తమ ఇంటికొచ్చి 'మా వెనుక వీరభద్రగౌడ్, గిరి మల్లేష్ గౌడ్ ఉన్నారు. ఈరన్న మాట వినకపోతే చంపి రమ్మన్నార' ని వారు బెదిరించారని వాపోయారు. అనుకున్నట్లే శుక్రవారం తన భర్త ఇంటి దగ్గర ఉండగా ఎపిఒ శ్రీనివాసులు, టిఎ శర్మాష్ వలీ ఫోన్ చేసి ఉపాధి పనుల కొలతలు తీసుకోవాలని, పని దగ్గరకు రమ్మని పిలిచారన్నారు. తన భర్త వస్తున్నాడని తెలుసుకున్న వారు బైక్‌పై వెళుతుండగా తన భర్తను ఆపి కంట్లో కారం చల్లి వేట కొడవళ్లతో నరికి చంపారన్నారని తెలిపారు. తన భర్త ఈరన్న హత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ఆమె ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ చేసిన పూర్తి వివరాలు మీడియాకు, బాధితులకు తెలపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

- మరో నలుగురికి గాయాలు

- ఆటోను ఢీకొన్న మరో ఆటో

ప్రజాశక్తి - మంత్రాలయం



విద్యార్థిని అనూష (ఫైల్)

ఆటోను మరో ఆటో ఢీకొన్న ఘటనలో విద్యార్థిని మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ వివరాల మేరకు... శనివారం మాధవరం గ్రామానికి చెందిన కురువ నాగప్ప కుమారుడు నాగరాజు (ఎపి 37 టిడి 6427 నెంబర్ గల) ఆటోలో మాధవరం నుంచి ఆదోనికి వెళ్తూ సుంకేశ్వరి గ్రామం బస్టాండ్ చేరుకున్నారు. అక్కడ విద్యానగర్ తండా గ్రామం రహదారిలో ఉన్న హై స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను ఎక్కించుకున్నారు. బయల్దేరగా చౌలహళ్లి గ్రామ క్రాస్ వద్ద ఆటోను నిలబెట్టుకొని ఉండగా వెనుక వైపు నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన (కెఎ 36సి 3078 నెంబర్ గల) ఆటో డ్రైవరు వేగంగా వచ్చి నిలబడి ఉన్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుంకేశ్వరి గ్రామానికి చెందిన ఈరమ్మ, రోగయ్య దంపతుల కుమార్తె, 10వ తరగతి విద్యార్థిని అనూష (15)కు తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరుకు తరలించగా మార్గమధ్యంలో అనూష మృతి చెందారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీమా పరిహారం పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ

బాధిత కుటుంబానికి బీమా పరిహారాన్ని అధికారులు అందజేశారు. మండలంలోని నేలతలమర్రి



పరిహారం అందజేస్తున్న ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ

గ్రామానికి చెందిన ఒంటెల రంగన్న గతేడాది జూన్‌లో ఉపాధి హామీ పని చేస్తూ గుండెపోటుకు గురయి మృతి చెందారు. ప్రభుత్వం మంజూరు చేసిన బీమా పరిహారం రూ.50 వేలు మృతుని భార్య ఒంటెల నాగమ్మకు శనివారం ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇన్‌ఛార్జీ ఎపిఒ రత్నం అందజేశారు. బీమా మంజూరుకు సహకరించిన ఎంపిటిసి సభ్యులు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సర్పంచి నాగరాజు గౌడ్‌కు ఒంటెల రంగన్న కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు మల్లికార్జున గౌడ్, గిడ్డయ్య గౌడ్, విజయ్ గౌడ్, గ్రామస్తులు దినకర్, ఒంటెల రంగస్వామి, శ్రీరాములు, పత్తికొండ చంద్ర పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్

సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ ఎస్.గంగిరెడ్డి పరిశీలించారు. శనివారం పట్టణంలోని 23వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో గల అన్నా క్యాంటీన్‌లో భోజన పంపిణీని తనిఖీ చేశారు. పట్టణంలోని పార్కు రోడ్డు, సోమప్ప సర్కిల్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

కూటమితోనే గ్రామాలాభివృద్ధి

- మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - నందవరం

సిసి రోడ్ల నిర్మాణంతో కూటమి ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి బాటలు వేసిందని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.



మండలంలోని రాయచోటి గ్రామంలో రూ.18 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. రాయచోటి గ్రామంలో రానున్న రోజుల్లో ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. మండల వ్యాప్తంగా సిసి రోడ్ల నిర్మాణాలు జరిగాయని, అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణానికి సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలూరు మండలం అరికెర గ్రామంలో ప్రత్యర్థుల దాడిలో మృతి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కురువ బండారి ఈరన్నకు సంతాపం తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో ఎపిఒ జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. మారుతి, ఆంజనేయులు, రాంప్రసాద్, నాగేంద్ర, ఆనంద్, మారుతి, లక్ష్మన్న, రాధాకృష్ణ, కదిరప్ప, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటు విశిష్టతను వివరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

ఓటు ఆయుధం లాంటిదని, ఓటు విశిష్టతపై అవగాహన కల్పించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆదోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి భీమాస్ సర్కిల్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. భీమాస్ సర్కిల్‌లో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు, పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదులో ఉత్తమంగా ప్రదర్శన చూపిన బిఎల్ఒలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. తహశీల్దార్ శివ రాముడు, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎన్నికల ఉప తహశీల్దార్ గాయత్రి, ఉప తహశీల్దార్ వలీ బాష పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.అనురాధ మాట్లాడారు. తహశీల్దార్ ఎస్.రవి, ఎంఇఒ రాఘన్న, డిప్యూటీ తహశీల్దార్ సరస్వతి, గురురాజా రావు, సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య, పిఇటి నరసింహ రాజు పాల్గొన్నారు. **చిప్పగిరిలో** ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేసి, అనంతరం ఓటు ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచి దాసరి గోవిందరాజులు, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్, ఆర్ఐ సునీత, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు, రెవెన్యూ కార్యదర్శులు మల్లికార్జున, వన్నూరు, మీనా, సర్వేయర్ హనుమా నాయక్, పవన్ కుమార్, రోజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్



మంత్రాలయంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్



చిప్పగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం

- హత్యా రాజకీయాలు తగవు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేయడం దారుణమని, ఇలాంటి హత్యా రాజకీయాలు తగవని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాంపురం గ్రామంలో ఆయన స్వగృహంలో మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి జిల్లాలో వైసిపి నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా దాడులు చేస్తూ ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తున్నారని, మంచి పద్ధతి కాదని హితవు పలికారు. వైసిపి ప్రభుత్వంలో హత్యా రాజకీయలను ప్రోత్సాహించలేదన్నారు. ఉద్యోగాలు, పదవుల విషయాల్లో ఒక్కటికి రెండుసార్లు ఆలోచించి, మాట్లాడి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈరన్న హత్య కేసులో నిందితులను గుర్తించి, అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈరన్న కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- వైసిపి జిల్లా కోశాధికారి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ



ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేయడం దారుణమని, టిడిపి నాయకుల ప్రోద్బలంతోనే ఈ హత్యకు పాల్పడ్డారని వైసిపి జిల్లా కోశాధికారి, సీనియర్ నాయకులు తెర్నేకల్ కొత్తకాపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం తగదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం హత్య చేయడంతో భార్య, పిల్లలు వీధిన పడ్డారన్నారు. టిడిపి ప్రభుత్వంలో వైసిపి వారిపై దాడులు పెరిగాయన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య అమానుషం

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి -దేవనకొండ

ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ హత్య అత్యంత అమానుషమని, ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాషతో కలిసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యాక్షన్ నుంచి సామాన్యులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని, అధికార దాహంతో హత్యలకు పాల్పడడం అమానుషమని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలు, డీలర్ల మార్పిడికి అధికారంలోకి వచ్చిన పార్టీలు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్న హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా శాఖల్లో పని చేస్తున్న వారికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వ్యకాస, సిఐటియు నాయకులు

ఆస్పరి : ఫీల్డ్ అసిస్టెంట్లపై దాడులను అరికట్టాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కార్యాలయంలో విధులు నిర్వహించే ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిడి చేయడం సమంజసం కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని నాయకులు ఇబ్బందికి గురి చేయడం, లేదంటే దాడులు చేయడం పద్ధతి కాదని మండి పడ్డారు. ఇప్పుడున్న ఫీల్డ్ అసిస్టెంట్లను కొనసాగించాలని కోరారు. ఈరన్న కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.20 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, వ్యకాస నాయకులు విరుపాక్షి, రజక సంఘం మండల కార్యదర్శి ఈరన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి పాల్గొన్నారు.



ఆస్పరి ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డ్రైవర్ కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్


సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల బస్ డ్రైవర్ సి.నాగరాజు గుండెపోటుతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి కళాశాల సిబ్బంది ఆర్థిక సహాయం అందజేసి ఆదుకుంది. శనివారం కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, యజమాన్యం తరపున రూ.55 వేల ఆర్థిక సహాయంగా అతని భార్య సి.సువర్ణకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుధాకర్ చేతుల మీదుగా అందజేశారు. వారి కుటుంబంలో ఒకరికి కళాశాలలో ఉద్యోగం కల్పించామని ప్రిన్సిపల్ తెలిపారు. ఎఒ ఈరన్న గౌడ్, నంద కిశోర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు తరలిరండి

- ఆలయ ధర్మకర్త, టిడిపి నాయకులు ఈరన్న గౌడ్

ప్రజాశక్తి - నందవరం

ముగతి గ్రామంలో ఫిబ్రవరి 1, 2, 3న జరిగే శ్రీజంబులా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్టాపనకు మండల ప్రజలు తరలి రావాలని ఆలయ ధర్మకర్త, టిడిపి సీనియర్ నాయకులు ముగతి ఈరన్న గౌడ్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీజంబులా పరమేశ్వరీదేవి ఆలయం ధ్వజస్తంభ, కలశ, విగ్రహ ప్రతిష్టాపన ఫిబ్రవరి 1, 2, 3న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ ఆహ్వాన పత్రికను ఆయన విడుదల చేశారు. పెద్దల నుంచి వారసత్వంగా అమ్మవారి పూజలు చేస్తున్నామని, అమ్మవారి ఆశీర్వాదంతో త్వరగా దేవాలయాన్ని నిర్మించామని చెప్పారు.




బలకుంది నటరాజ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలతో విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజ స్తంభం ప్రతిష్టాపన చేపడుతున్నట్లు తెలిపారు.

చట్టం అందరికీ సమానమే...

- కక్ష సాధింపులను బీవీ ఎప్పుడూ ప్రోత్సాహించరు - టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్

చట్టం అందరికీ సమానమేనని, ఎవరికీ చుట్టం కాదని, తన పని తాను చేసుకుంటూ పోతుందని టిడిపి నాయకులు బందే నవాజ్, కలీముల్లా, ఖాసీం వలీ, అల్తాఫ్, నరసప్ప తెలిపారు. వైసిపిపై టిడిపి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసిపి నాయకులు చెప్పడం పద్ధతి కాదని, కక్ష సాధింపు చర్యలను టిడిపి కానీ, బీవీ కుటుంబం ప్రోత్సహించదని పేర్కొన్నారు. శనివారం వారు టిడిపి కార్యాలయంలో మాట్లాడారు. చట్టం ప్రకారమే పోలీసులు కేసు నమోదు చేశారని, పట్టణ ఎస్ఐని ధూషించింది ఎవరో ఆధారాలు వీడియోలో ఉన్నాయని తెలిపారు. ఎవరి ప్రోద్బలంతోనూ పోలీసులు కేసులు నమోదు చేయలేదని, సంఘటన గురించి ఆధారాలతో కేసు నమోదు చేశారని చెప్పారు. ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఎవరి సూచనలు, సలహాలు తీసుకోరని, ఎమ్మెల్యే ఎవరి మాటా వినరని, ఆయన మాట శాసనమని తెలిపారు. తండ్రి మోహన్ రెడ్డి బాటలోనే ఎమ్మెల్యే బీవీ అభివృద్ధి బాటలో ముందుకెళ్తున్నారని చెప్పారు. ఆయన ఏనాడూ కక్ష సాధింపు చర్యలను ప్రోత్సహించలేదని, అలాంటి పరిస్థితి ఉంటే మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్‌పై రోజూ కేసు పెట్టేవారని తెలిపారు. నజీర్ అహ్మద్ జామియా మసీదు దుకాణాలు లీజుకు తీసుకొని ఇప్పటివరకు లీజు చెల్లించకుండా టోపీ పెట్టిన ఘనుడని, వైసిపి పాలనలో ఘర్షణలు సృష్టించింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు



ఆర్థికసాయం అందజేస్తున్న సీతారామిరెడ్డి

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు శివారులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ శివ కుటుంబానికి వైసిపి నాయకులు, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో గల శివ తండ్రి సోమన్నకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుజయీంద్ర, హయవదన, అభిలాష్ కుటుంబాలకు సహాయ, సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హామీఇచ్చారు. వై.సీతారామిరెడ్డి ద్వారా బాధితులకు ఆర్థిక సహాయం అందించారు. అలాగే స్థానిక రాఘవేంద్ర నగర్‌లో నివాసముంటున్న డ్రైవర్ సంగమేష్ కుటుంబానికి వైసిపి నాయకులు వై.సీతారామిరెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. సంగమేష్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన సంగమేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తక్షణ సహాయం కింద రూ.5 వేలు అందజేశారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, మండల ఇన్‌ఛార్జీ సివి.విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వెముగోడు గ్రామంలో టిడిపి నాయకులు, అధికారులు ఇంటింటికీ కుళాయి పనులను ప్రారంభించారు. టిడిపి మండల నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్య, తిమ్మారెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షులు నరసింహులు, సత్యం స్వామి మాట్లాడుతూ... ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి గతంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.60 లక్షలతో గ్రామంలో రోడ్లు, గోకులం షెడ్లు ఏర్పాటు చేయించారని తెలిపారు. ప్రస్తుతం ప్రజల నీటి కష్టాలను తీర్చేందుకు జల జీవన్ మిషన్ కింద గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి వెముగోడు గ్రామానికి తాగునీటిని అందించేందుకు ఇంటింటికీ కుళాయి పనులను ప్రారంభించారని చెప్పారు. రాజేష్, అంపన్న, అల్లీపీరా, దానమయ్య, ఏసన్న, రాముడు, బాబు, భాస్కర్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
76వ గణతంత్ర దినోత్సవ ప్రత్యేక అనుబంధం
ఆదివారం 26 జనవరి 2025

సమాఖ్య విధానం నిర్వీర్యం - కేంద్రీకరణ ధోరణులు

- క్రమబద్ధమైన రీతిలో రాజ్యాంగ ఉల్లంఘన ప్రక్రియ

- ఆచార్య ఎస్. మన్సూర్ రహమాన్, మానవశక్తి పరిశోధన అండ్ అభివృద్ధి కేంద్రం, కర్నూలు.



స్వాతంత్రం వచ్చిన తొలి ఆరు దశాబ్దాల కంటే వంద రేట్లు ఎక్కువగా రాజ్యాంగ ఉల్లంఘనలు ఈ దశాబ్దంలో జరిగినట్లు చెప్పవచ్చు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకున్న మన ఆర్థికవ్యవస్థ, ప్రభుత్వ రంగానికి పెద్దపీట వేసి శ్రేయో రాజ్యస్థాపనకు పునాది వేసినది. అయితే ఆ మౌలిక స్వరూపం నుంచి మనం క్రమంగా వైదొలిగి పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థగా, స్వేచ్ఛా వాణిజ్య విపణిలో ప్రవేశించి ఆర్థిక శక్తి కేంద్రీకరణకు అవకాశాన్ని ఇచ్చాం. ఫలితంగా పేదరికం, అసమానతలు, నిరుద్యోగం పెరిగి బాంగ్లాదేశ్ లాంటి చిన్న దేశాల స్థాయి అభివృద్ధిని కూడా సాధించలేక పోతున్నాం.

1. బలం పెంచుకుంటున్న కేంద్ర ప్రభుత్వం - బలహీన పడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు: మన రాజ్యాంగం కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల విభజనను స్పష్టంగా తెలియ జేసింది . కేంద్ర జాబితాలో 99 అంశాలు , రాష్ట్రజాబితాలో 61 అంశాలు ఉన్నాయి. ఉమ్మడి జాబితాలో 52 అంశాలు ఉన్నాయి. కేంద్రానికి, రాష్ట్రానికి ఉమ్మడి జాబితాపై చట్టాలు చేసే అధికారం ఉంది, కానీ రెండింటి మధ్య వివాదం తలెత్తినట్లయితే, రాష్ట్ర చట్టం కంటే కేంద్ర చట్టం అమలులో ఉంటుంది. భారత పార్లమెంటుకు రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైనైనా చట్టాన్ని రూపొందించే (మిగతా 2వ పేజీలో...)

సమాఖ్య విధానం నిర్వీర్యం - కేంద్రీకరణ ధోరణులు

మొదటి పేజీ తరువాయి.. అధికారం కూడా ఉంది. రాజ్యసభ మూడింట రెండు వంతుల మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించినట్లయితే, అది యూనియన్ జాబితాకు లోబడి రాష్ట్ర బదిలీకి పార్లమెంటుకు అధికారాన్ని ఇస్తుంది. ప్రస్తుత ప్రభుత్వపు నైపుణ్యం ఈ విషయంలో స్పష్టంగా చూడవచ్చు.

2.వివాదాస్పదమవుతున్న నామినేటెడ్ గవర్నర్ పెదవులు: రాష్ట్ర స్థాయిలో కార్య నిర్వాహక ఆర్టికల్ 154 అన్ని కార్యనిర్వాహక అధికారాలను గవర్నర్‌కు అందిస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 , 201 సంబంధిత రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లుకు తన ఆమోదాన్ని నిలిపివేయడానికి గవర్నర్‌కు అధికారం ఇస్తుంది. రాష్ట్ర పరి పాలనను అస్త వ్యస్తం చేయడానికి యిది ఉప యోగ పడుతుంది. గతంలో మహారాష్ట్ర, గోవా, కర్ణాటక తదితర ఎన్నో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చడంలో గవెర్నర్ల పాత్ర కీలకం. వీరి అనైతిక రాజకీయాలతో ఆ పదవికి కళంకం తెస్తున్నారు.

3.ఆర్థిక వ్యవహారాలపై నిఘా: కంప్ట్రోలర్ , ఆడిటర్ జనరల్‌ను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఆయన కేంద్ర రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. ఆడిటర్‌గా, ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాలను ఆడిట్ చేసి, ఏటా భారత ప్రభుత్వానికి నివేదిస్తాడు. ప్రతిపక్ష ప్రభుత్వాలపై అభియోగాలు సర్వ సాధారణం.

4.స్వతంత్రత కోల్పోయిన ఎన్నికల కమిషన్: ఎన్నికల కమిషనర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇందులో రాష్ట్రాలకు ఎటువంటి పాత్ర ఉండదు. వీరి నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం.

5.ఆర్థిక కేటాయింపులో రాజకీయాలు: రాష్ట్రాలు తమ ఆర్థిక అవసరాల కోసం కేంద్రంపై ఆధారపడి ఉన్నాయి. ముఖ్యంగా, వరదలు, కరువు సమయంలో రాష్ట్రాలు కేంద్రం ఆర్థిక సహాయంపై మాత్రమే ఆధార పడాలి. సమాఖ్య విధానంలో రాష్ట్రాలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఉండాలి. భారత రాజ్యాంగం ఆర్థిక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ కొన్ని వనరుల నుండి వచ్చే ఆదాయాలను కేటాయిస్తుంది, సర్దుబాటు చేస్తుంది. అయితే ఇక్కడ కూడా నీచ రాజకీయలు చోటుచేసుకోడం దురదష్టకరం. ఇది నిజమైన సమాఖ్య పనితీరుకు ఆరోగ్యకరమైన విధానం కాదు.

6.రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై కేంద్రం దురాక్రమ: కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు చేస్తున్న ముఖ్యమైన అభియోగం ఏమిటంటే, రాష్ట్ర శాసనసభ జాబితాలో చేర్చబడిన అంశాల విషయంలో కూడా అది అతిక్రమించి వారి స్వయంప్రతిపత్తిని ఆక్రమిస్తున్నది. భారత యూనియన్‌ను వాస్తవానికి ఏకీకృత రాష్ట్రంగా మార్చే ప్రక్రియ కొనసాగుతున్నది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్రాల అధికారాన్ని తగ్గించడానికి రాజ్యాంగాన్ని ఒక సాధనంగా ఉపయోగించు కుంటున్నది. కేంద్రం తన అధికారం ద్వారా రాష్ట్ర స్వయంప్రతిపత్తిలోకి చొరబడుచున్నది. వివిధ రాజ్యాంగ సవరణలు అనేక రాష్ట్ర అంశాలను కేంద్రం నియంత్రణలోకి తెచ్చాయి.

7.పన్ను వసూలు యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలనుంచి స్వాధీనం చేసుకునే ప్రయత్నం: ఆర్టికల్ 360 ప్రకారం ఆర్థిక అత్యవసర పరిస్థితికి దారితీయనంత వరకు రాష్ట్రాలు తమ ఆర్థిక నిర్వహణకు స్వేచ్ఛను కలిగి ఉంటాయి. అయితే భారత ప్రభుత్వం భారతదేశం అంతటా ఏకరీతి పన్ను చట్టాలను విధించడానికి, రాష్ట్రాల పన్ను వసూలు యంత్రాంగాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించడం రాజ్యాగస్ఫూర్తికి విఘతం కలిగిస్తున్నది.

8.పారిశ్రామిక విధానం: ఉమ్మడి జాబితాలో ఒక అంశంగా ఉన్న పరిశ్రమలను యూనియన్ జాబితాకు బదిలీ చేయడం సమాఖ్య విధానాన్ని తూట్లు పొడవడమే. ఇది కార్పొరేట్ సంస్థలకు సహాయ పడి, ఆర్థికశక్తి కేంద్రీకరణకు దారితీసే అవకాశం ఉంది.

9.హిందీ భాషను బలవంతంగా రుద్దడం: భారతదేశంలోని హిందీ భాషాభివృద్ధి కి కేటాయించిన మొత్తం, ఇతర భాషలకు కలిపి కేటాయించిన మొత్తానికంటే 30 రెట్లు ఎక్కువ. ఇదీ వివిధ రాష్ట్రాలలో అసమ్మతికి దారితీసింది.

10.ప్రత్యేక హోదా విషయంలో వివక్ష: కేంద్ర ప్రభుత్వం 11 ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక కేటగిరీ హోదాను అనేక సవరించిన నిబంధనలతో మంజూరు చేసింది,కానీ అనివార్య పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర విభజన కారణంగా జరిగిన తీవ్ర నష్టాన్ని పూరించే ప్రయత్నం చేయలేదు. ప్రత్యేక హోదా మంజూరు చేస్తామని పార్లమెంటులో అప్పటి ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని ఈ ప్రభుత్వం తిరస్కరించి తీసుకున్న నిర్ణయం వివక్షతో కూడుకున్నది.

11.రిజర్వు బ్యాంకు ఏకపక్ష నిర్ణయాలు: ఆర్‌బిఐనోట్ల రద్దు విషయంలో రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొనక పోవడం, కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం సమాఖ్య స్ఫూరికి విరుద్ధం. ఈ మధ్య చాల నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోనే జరుగుతున్నాయి

12.హిందీ రాష్ట్రాలకు కేటాయింపులలో సింహ భాగం: దక్షిణ భారత రాష్ట్రాల సామాజిక -ఆర్థిక పురోగతిని సాధించాయి. ఆర్థిక క్రమశిక్షణను పాటించి కుటుంబ నియంత్రణ లక్ష్యాలను సాధించి అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. దీనికి ప్రతిఫలంగా, కేంద్ర ప్రభుత్వం వీటికి తక్కువ వనరుల కేటాయింపులు చేస్తున్నది. బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తర రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణ భారత రాష్ట్రాలు తాము చెల్లించే దానికంటే చాలా తక్కువ మొత్తాన్ని పొందు తున్నాయి. ఎపి కేంద్రానికి చెల్లించే ప్రతి రూపాయికి దాదాపు 40 పైసలు పొందు తున్నది, ఉత్తరప్రదేశ్ చెల్లించే ప్రతి రూపాయికి రూ. 1.8 చొప్పున పొందుతున్నది . ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఉత్తర భారత రాష్ట్రాలకు అనుకూలంగా, ఎక్కువ డబ్బు కేటాయించడం, తన లక్ష్యాలను ఉత్తమంగా సాధించినందుకు మొదటి ర్యాంకర్‌ను శిక్షించడం, ఆశించిన పని చేయనందుకు చివరి ర్యాంకర్‌కి బహుమతి ఇవ్వడం లాంటిది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళతో సహా మహారాష్ట్ర దేశ ప్రత్యక్ష పన్నులలో దాదాపు 50శాతం వాటాను అందిస్తున్నాయి. అయితే ఈ రాష్ట్రాలు బడ్జెట్‌లో చాలా తక్కువ కేటాయింపులను పొందుతున్నాయి.

13.రాజ్యాంగ వ్యవస్థల దుర్వినియోగం: ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోయడానికి , సంక్షోభాలను సృష్టించడానికి , ప్రజా ప్రతినిధులను అనైతికంగా కొనుగోలు చేయ డానికి రాజ్యాంగ వ్యవస్థలయిన ఇడి, సిబిఐ, ఐటి, ఎన్ఐఎ, ఎన్‌సిబి, ఇసిఐ లను ఉపయోగించుకోవడం నీచాతినీచమైన చర్య. కేవలం అవినీతి, నేర ప్రవృత్తి ఒకవైపు మాత్రమే ఉన్నట్లు భ్రమింపజేసే ప్రయత్నమిది. అత్యున్నత న్యాయవ్యవస్థలను కూడా ఈ బురదలోకి లాగి కళంకం తేవడం ఈ మధ్య సంభవిస్తున్న దురదృష్టమయిన పరిణామం.

రాజ్యాంగం

ప్రజాస్వామ్యానికి కవచం
రాజకీయ అవినీతికి అంకుశం
ప్రజల హక్కులకు ఆయుధం
మాన ప్రాణ రక్షణకు రామబాణం

కానినేడు మణిపూర్‌లో ఆరని
మంటలు
రైతుల పై ఆగని దమనకాండ
కార్మికుల ఆకలికేకలు
పేదల బ్రతుకుల ఆరటం.

పాలకుల రాక్షస విధానాలతో
రాజ్యంగం మూసివేయబడింద!
రుద్ర భూమిలో నిర్జీవులైన
పాలకులారా!
మీ గాంధారి రాజ్యంలో కనబడలేద
ప్రజలకష్టాలు

రామా ! ఏమిరాజ్యం
ఆకలి పేగుల మంటలతో
ఈ దేశం రగిలింది.
చీకటి బ్రతుకుల కేకలతో
ఆకశం ఎర్రబడింది.

జాతిని మతం పేరుతో
మరు భూమిగా మార్చొద్దు
రాజ్యాంగాన్ని రక్షించి
అమలు పరుచుకుందం!

- ఇమ్మానుయేలు.



రాజ్యాంగం దేశానికి పెద్ద దిక్కు



భారత రాజ్యాంగం దేశపాలనకు పెద్దదిక్కు. అందరికీ సమాన హక్కులను ప్రసాదించి సమాజంలో అందరూ సమానమే అన్న భావనకు భరోసాగా నిలిచింది. అసమానతలను రూపుమాపేందుకు బడుగు బలహీన దళిత, గిరిజన మైనార్టీలకు అండగా నిలిచింది. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత.

- బొల్లెద్దుల సాయి ప్రశాంత్, బిఆర్‌కె ఫౌండేషన్ నాయకుడు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేద్దాం

- హైకోర్టు న్యాయవాది వై.జయరాజు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిఒక్కరు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలని హైకోర్టు న్యాయవాది వై.జయరాజు కోరారు. ఆయన మాటల్లో.... 1950 జనవరి 26న మనం వైరుధ్యాల జీవితం లోకి ప్రవేశించ బోతున్నాం. రాజకీయాల్లో మనకు సమానత్వం ఉంటుంది. సామాజిక , ఆర్థిక జీవితంలో మనకు అసమానతలు ఉంటాయి. రాజకీయాల్లో ఒక మనిషికి ఒక ఓటు, ఒక ఓటు ఒకే విలువ అనే సూత్రాన్ని గుర్తిస్తాం. మన సామాజిక , ఆర్థిక జీవితంలో, మన సామాజిక , ఆర్థిక నిర్మాణం కారణంగా, ఒక మనిషి ఒకే విలువ అనే సూత్రాన్ని తిరస్కరించడం కొనసాగిస్తాం. మన సామాజిక , ఆర్థిక జీవితంలో సమానత్వాన్ని ఎంతకాలం నిరాకరిస్తాం. మనం దానిని చాలా కాలం పాటు నిరాకరిస్తూనే ఉంటే, మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేయడం ద్వారానే అలా చేస్తాం. సాధ్యమైనంత త్వరగా ఈ వైరుధ్యాన్ని మనం తొలగించాలి. బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ రాజ్యాంగ సభలో చివరి ప్రసంగం నుండి అంశాలున్నాయి.

జనవరి 26 స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన రోజు ఈ రోజున ప్రపంచ ప్రఖ్యాత మేధావి గొప్ప దేశభక్తుడు, సంఘ సంస్కర్త బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది. భారత రాజ్యాంగమే చట్టం. భూమి యొక్క



రాజ్యాంగాన్ని పరిరక్షించడం, రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరచబడిన దాని ప్రధాన ఆదర్శాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని గ్రహించడం మన గంభీరమైన కర్తవ్యాన్ని గుర్తుచేసుకోవడానికి గణతంత్ర దినోత్సవ వేడుకలు చాలా అవసరం".

నేషనల్ లాయర్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో ఈనెల 26న ఉదయం 10.30 గంటలకు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం సర్కిల్, పాత బస్టాండ్, కర్నూలులో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. దీనికి సీనియర్ న్యాయవాది వై.జయరాజు, కర్నూలు ఎపి హైకోర్టు, ప్రెసిడెంట్, నేషనల్ లాయర్స్ ఫోరమ్ ఐర్ సోషల్ జస్టిస్ అధ్యక్షత వహిస్తున్నారు.భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న న్యాయవాదులు, నిపుణులు, ఉద్యోగులు, విద్యార్థులు , ప్రజా సంఘాల నాయకులను, సభ్యులందరిని ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం.

అసమానం భారత గణతంత్రం

స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం పునాదిగా, పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణగా భారత దేశాన్ని సర్వసత్తాక సామ్యవాదలౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగా రూపొందించిన భారత రాజ్యాంగం అమలు లోనికి వచ్చిన శుభ దినం. భిన్నత్వంలో ఏకత్వం మన భారత దేశ మూల సూత్రం జాతి కుల మత ప్రాంతీయ భావాలకు స్వస్తి పలికి అక్షరాస్యులని, నిరక్షరాస్యులని వివక్ష విడిచి పేద ధనిక తారతమ్యంకు తావివ్వక లింగ వివక్షను వీడి సమాన ఓటు హక్కును ప్రసాదించి ప్రపంచ దేశాలలో మణి మకుటంగా నిలిచింది మన రాజ్యాంగం అయితే రాజ్యాంగం కావాలి రాజకీయాలకు, పార్టీ సిద్ధాంతాలకు అతీతం అన్ని రంగాలలో అన్ని వర్గాల వారికి అందాలి సమ న్యాయం సమ ధర్మం భారతీయులంతా శాంతి సోదర భావం తో కలసి మెలసి జీవించాలి. తీవ్రవాదం అంతర్యుద్ధం, కక్షలు, కార్పణ్యాలు నిర్మూలించేందుకు కలిసి కట్టుగాశ్రమించాలి. అపవిడే నెరవేరుతుంది అసమాన మేధో సంపన్నుడు, భవిష్యత్ దార్శనికుడు, రాజ్యాంగ కర్త డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ కన్న



మధుర స్వప్నం, రవీంద్ర కవీంద్రుని నిర్భయ భారత సాక్షాత్కారం మన భారత దేశం కావాలి ఆదర్శ దేశం, యితరదేశాలు చెయ్యాలి వందనం, భారతం అహింసా యుతమై ఎగరాలి ఎగరాలి శాంతి బావుటా, భారతీయులు కావాలి శాంతి కపోతాలు, స్వేచ్ఛగా ఎగరాలి జీవితం లో ఉన్నత శిఖరాలకు

డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా, కర్నూలు.

నేడు మాంసపు విక్రయాలు బంద్

- నగరపాలక ప్రజారోగ్య అధికారి స్పష్టం - నగర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

- నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎలాంటి జంతువులను వధించరాదని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం కబేళాలు, అన్ని రకాల మాంసపు విక్రయ దుకాణదారులు మూసి వేయాలని, హోటళ్ళు, రెస్టారెంట్లలో ఎట్టిపరిస్థితుల్లోనూ మాంసపు పదార్థాలు విక్రయించకూడదని తెలిపారు. నగర వ్యాప్తంగా తనిఖీలు జరుగుతాయని, ఎవరైనా అమ్మకాలు చేస్తూ పట్టబడినా, నిషేధాజ్ఞలు ఉల్లంఘించి అమ్మకాలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అటువంటి దుకాణ ట్రేడ్ లైసెన్స్‌రద్దు చేసి, భారీ జరిమానా విధిస్తామన్నారు. అంతేకాకుండా చట్టపరమైన చర్యలు సైతం తీసుకుంటామని, వ్యాపారాలు సహకరించాలని ప్రజారోగ్య అధికారి కోరారు.

ఓటర్లుగా నమోదు కావాలి : జెసి డాక్టర్ నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

యువ ఓటర్లు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహిస్తున్న జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లుగా మన బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. స్పెషల్ సమ్మర్ రివిజన్‌లో భాగంగా జనవరి 5న పబ్లిష్ చేశామని, దానికి ముందు డ్రాఫ్ట్ ఎలక్ట్రోల్ రోల్, ఫైనల్ ఎలక్ట్రోల్ రోల్ తయారు చేసుకున్నామన్నారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్‌ల ద్వారా యువ ఓటర్ల నమోదు చేస్తామన్నారు. అనంతరం వక్తృత్వ పోటీలు, వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ సిటిజన్స్, విభిన్న ప్రతిభావంతుల ఓటర్లను శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, ఉపాధి కల్పన అధికారి దీప్తి, ఎన్నిక విభాగ సూపరింటెండెంట్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని వెల్దుర్తి మండల తాహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా వచ్చి పాత బస్టాండ్ కూడలిలో ఓటు పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి రెవెన్యూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకిని ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలన్నారు.

సి బెళగల్ : మండలంలో ఓటరు దినోత్సవం సందర్భంగా ఇంచార్జి తహసీల్దార్ పురుషోత్తం శనివారం విద్యార్థుల, సిబ్బంది సమక్షంలో భారీగా ర్యాలీ నిర్వహించారు. ఇక్కడే ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటు ప్రతి పౌరునికి వజ్రాయుధం అని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం మొదలు కొని బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్, సంత బజారు వరకు ర్యాలీతో వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ లో మానవహారంగా నిలబడి ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

కర్నూలు కలెక్టరేట్ : రాయలసీమ యూనివర్సిటీలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్, రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడులు పాల్గొని విద్యార్థులు అధ్యాపకులు తో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులందరూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని విద్యార్థులను కోరారు.

వొకేషనల్ జూనియర్ కళాశాలలో : స్థానిక బి- క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల లో శనివారం నాడు 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ప్ర అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల దినోత్సవ అవగాహన ర్యాలీని జిల్లా వృత్తి విద్య అధికారి వై.పరమేశ్వర రెడ్డి, డిఎస్‌పి మహబూబ్ బాష, సిల్వర్ జూబ్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వివి సుబ్రహ్మణ్య కుమార్ ప్రారంభించారు. ర్యాలీలో కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటు హక్కును తీసుకోవాలని రెండవ పటాలం అసిస్టెంట్ కమాండర్ ఎస్.మహబూబ్ బాషా అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల, ఎస్‌ఎస్‌పి క్యాంప్, కట్టమంచి రామలింగారెడ్డి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు (8,9,10 తరగతి) ప్రజాస్వామ్యం - ఓటు హక్కు ప్రాముఖ్యత అనే అంశం పైన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.మహబూబ్ బాషా ముఖ్యఅతిథిగా హాజరై ఓటు హక్కు ప్రాముఖ్యత విద్యార్థులకు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం లాంటిదని దాన్ని దుర్వినియోగం చేయకూడదని తెలిపారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగం ఓటు హక్కు ప్రాముఖ్యత తదితర అంశాల గురించి చార్టుల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సోదాహరణంగా వివిధ కళారూపాలలో వివరించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ముఖ్య అతిథి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులచే అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయునులు ఎం.సుగుణమ్మ, డి.రోజమ్మ, కె.శివకుమారి బాయి, డి.రూతమ్మ తదితరులు పాల్గొని ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క ప్రాముఖ్యతను స్పష్టంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుగ్గలి : ఓటర్స్ డేసందర్భంగా తుగ్గలి లోని జెడ్‌పిహెచ్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నేషనల్ ఓటర్స్ డే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ర్యాలీలో తహశీల్దార్ రమాదేవి, ఉప తహశీల్దార్ నాగరాజు, విఆర్ఓ తిమ్మయ్య, విద్యార్థులకు ఓటు ప్రాధాన్యతను వివరించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకొని ప్రతి ఒక్కరు రాబోయే కాలంలో ఓటును వినియోగించుకొని బావి భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమే అని సూచించారు. విద్యార్థులకు ఓటు నమోదుకు కావాల్సిన అర్హతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిహెచ్ హైస్కూల్ హెడ్మాస్టర్ బాబురావు, మ్యాథమెటిక్స్‌టీచర్ సుధాకర్ గౌడ్, పిఇటి చందునాయక్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో ఓటర్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించి,ప్రతిజ్ఞ చేయించారు.


తుగ్గలిలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


వెల్దుర్తిలో జాతీయ ఓటరుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న మహబూబ్ బాష

మైపర్‌లో ఘనంగా ఓటర్స్‌డే

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఏ క్యాంపులోని మై పర్ ఫార్మసి కళాశాలయంతో శనివారం నేషనల్ ఓటర్స్ డే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ పోలీస్ డిఎస్‌పి మహబూబ్ బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఓటు యొక్క ప్రాధాన్యతను తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకొని ప్రతి ఒక్కరు రాబోయే కాలంలో ఓటును వినియోగించుకొని బావి భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమే నని తెలిపారు. విద్యార్థులకు ఓటు నమోదుకు కావాల్సిన అర్హతను తెలిపారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాసర్ల సురేష్ , డాక్టర్ ఎం రాజ్ కుమార్, రొడ్డ రఘువీర్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేయించారు.

స్వాతంత్ర్య సమరయోధులు టికెఆర్ శర్మ

- క్లస్టర్ యూనివర్సిటీ విసి సాయిగోపాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రముఖ స్వతంత్ర సమరయోధులు గాంధేయవాది రాయలసీమ గర్వించదగ్గ విశిష్ట దేశభక్తులు టికెఆర్ శర్మ (తాళ్లపల్లి కరణం రామచంద్ర శర్మ) అని వారి శతజయంతి ఉత్సవాన్ని జరుపుకోవడం సంతోషకరమని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య డివిఆర్‌సాయి గోపాల్ అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ సభ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ వర్ధంతి ఈనెల 30న టికెఆర్ శర్మ శత జయంతి జరుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బహుముఖీనమైన శర్మ నాయకత్వాన్ని సమాజ ప్రేమను గుర్తుకు చేసుకుంటూ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాహితీ సదస్సు సహకారంతో శర్మ శతజయంతి సభను క్లస్టర్ యూనివర్సిటీ కెవిఆర్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ ప్రముఖ సోషలిస్టుగా వందల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిపెట్టిన సహృదయులు అలాగే గాంధీజీ, ప్రకాశం బాటలో వారి సిద్ధాంతాల వెంట నడిచిన ఉన్నత శ్రేణి జాతీయ నాయకులు శర్మ అని గుర్తుచేశారు. విద్యార్థులకు గాంధేయ సమతావాదం-నేటి ఆవశ్యకత అనే అంశంపై వక్తృత్వం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చామన్నారు. శర్మశత జయంతి సభను విజయవంతం చేయాలని కుమారుడు టికే కృష్ణమూర్తి అల్లుడు మురళి కుటుంబ సభ్యులు కోరారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టికెఆర్ శర్మ శత జయంతి ఉత్సవాల్లో క్లస్టర్ యూనివర్సిటీ భాగస్వామ్యం అయినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జెఎస్‌ఆర్‌కె శర్మ, డాక్టర్ పార్వతి దేవి, డాక్టర్ ఫామీద డాక్టర్ వింధ్యావాసిని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ విసి సాయిగోపాల్

రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు

- ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ డైరెక్టర్, నందికొట్కూరు వైసిపి నాయకులు ఎక్కల దేవి చంద్రమౌళి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్



భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, రాజ్యాంగాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ డైరెక్టర్, నందికొట్కూరు వైసిపి నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి ప్రజాశక్తితో అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తి పాఠకులకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950 జనవరి 26 నుంచి అంబేద్కర్ రచించిన మనం రూపొందించుకున్న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత భారత దేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగా అవతరించిన ఈ రోజును ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. రాజ్యాంగం అనగానే అందరికీ అంబేద్కర్ గుర్తుకు వస్తారని ఆయన అన్నారు. అంబేద్కర్ రచించిన ఈ రాజ్యాంగం ప్రజలకు చేరాలంటే చదువుకున్న మేధావులు, ఉద్యోగస్తులు, రాజకీయ నాయకులు రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. అంబేద్కర్ దళితవాడకు హరిజనవాడకే పరిమితం చేయడం కరెక్ట్ కాదని ఆయన అందరివాడని కొనియాడారు. అంబేద్కర్ ఒక్క దళిత బహుజనులకే కాదని మహిళలు రైతులు కార్మికులు ఉద్యోగస్తులందరికీ రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించరాని తెలిపారు. అనేక దేశాలు అంబేద్కర్ గొప్పతనాన్ని పొగుడుతున్నాయని ఆ స్ఫూర్తితో మేం కూడా మా తండ్రి వై.ఐజయ్య నందికొట్కూరు శాసనసభ్యులుగా ఉన్నప్పుడు 93 అంబేద్కర్ విగ్రహాలకు ఆర్థిక సహకారం అందించి గ్రామ గ్రామాన నెలకొల్పామని తెలిపారు. అంబేద్కర్ చేతిలో భారత రాజ్యాంగం పుస్తకం ఉంటుందని దాని ప్రేరణగా తీసుకొని విద్యార్థులు మంచి చదువులు చదువుకోవాలన్నారు. చదివే వారికి మార్గం చెబుతుందని తెలిపారు. భారత రాజ్యాంగం భగవద్గీత బైబుల్ ఖురాన్‌లతో సమానమని అన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున మహనీయుల గురించి స్మరించుకుని దేశ సహజ వనరులు, వనరులు సంపదను సక్రమంగా వినియోగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తమ సహాయ సహకారాలను అందించాలని ఆయన కోరారు.

దేశ పవిత్ర గ్రంథం రాజ్యాంగం

– కె.మద్దిలేటి, బి.తాండ్రపాడు ఎంపిటిసి



దేశ ప్రజల అత్యున్నత గౌరవ పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం. దాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగం నీడలోనే దేశానికి రక్షణ, అభివృద్ధి, సంక్షేమం ముందుకు సాగుతున్నాయి. సామాన్యుడి నుంచి అత్యంత ధనికుని వరకు అందరూ సమానం అన్న స్ఫూర్తి భావనను కలిగించే గొప్ప కావ్యం. నేడు నేను అనుభవిస్తున్న ప్రజా ప్రతినిధి గౌరవం రాజ్యాంగం పరిధిలోనిదే. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి పునాది రాజ్యాంగమే.



స్థానిక సంస్థలను ప్రసాదించింది రాజ్యాంగమే

- బి.గోపాల్ పంచాయతీ సెక్రటరీ బి.తాండ్రపాడు

మూడంచల స్థానిక సంస్థల వ్యవస్థను దేశానికి రాజ్యాంగమే ప్రసాదించింది. జాతిపిత గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య ఆశయాలను నెరవేర్చే దిశగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పాలన వ్యవస్థకు దిక్సూచిగా నిలుస్తుంది.

పెరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక స్టాల్

- ఎగ్జిబిషన్ రూపంలో వైద్య ఆరోగ్య కార్యక్రమాలు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతి కళ

కర్నూలు-ప్రజాశక్తి హాస్పిటల్



భారత రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు పెరేడ్ గ్రౌండ్ లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ నేషనల్‌హెల్త్ ప్రోగ్రామ్స్, హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, మాతా శిశు సంరక్షణ సేవలు గురించి ఈ స్టాల్‌లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్, 30 సంవత్సరాల పైబడిన వారికి సంబంధించి క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్, బాలలకు సంబంధించిన ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె ప్రోగ్రామ్స్, చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ పైన ఈ స్టాల్‌లో ప్రత్యేక ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటిపై కరపత్రాల రూపంలో కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శకటంలో ఆరోగ్యశాఖ సేవలన్నీ డిజైన్ చేసి ప్రదర్శిస్తున్నామని తెలిపారు. రిపబ్లిక్ డే ఉత్సవాలు జరిగే పెరేడ్ గ్రౌండ్ లో డాక్టర్స్, నర్సులతో ఫస్ట్‌ఎయిడ్ కిట్టుతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.